# పిరికి పంద

పేరేపు లక్ష్మి

**త**ల దువ్వుకుంటూ నా ముఖకవళికల్ని అద్దంలో యధాలాపంగా గమనించాను. అక్కడక్కడ నెరుస్తున్న జుట్టు, కళ్ళక్రింద యేర్పడ్డ నల్లటి చారలు, యౌవ్వనపు బిగువు సడలి కొద్దిగా ముడుతలు పడుతున్న శరీరం, గడిచిన నా ముప్ఫైనాలుగేళ్ళ జీవితాన్ని యెత్తి చూపుతున్నట్లున్నాయి.

నలభయ్యోపడిలో పడ్డ నన్ను యెగతాళి చేస్తున్నట్టున్నాయి. మరోసారి క్రాఫ్ సరిగ్గా దువ్వుకుని టై కట్టుకున్నాను. స్నఫ్ కలర్ పేంట్, క్రీమ్‌కలర్ షర్టు వేసుకుని మరోసారి నా ప్రతి రూపాన్ని నిలువుటద్దంలో చూసుకున్నాను. ఫర్వాలేదు! అచ్చం పెళ్ళి కొడుకు లాగే వున్నాను.

'మేరే సపనోఁకీ రానీ కబ్ ఆయేగీ తూ' సిన్మా పాట హమ్ చేస్తూ, మధ్యలో చంటిపిల్లాడి యేడుపు అపశ్రుతిలా వినబడి టక్కున ఆగిపోయాను. ప్రక్కయింట్లో నుండి వస్తున్న ఆ యేడుపు ఎవరిదై వుంటుందబ్బా! అప్పుడు గుర్తొచ్చింది.... నాలుగు రోజుల క్రితం అమ్మ చెప్పింది 'గౌరి వచ్చిందిరా. మూడవ కాన్పు. మగపిల్లాడు పుట్టాడు. ఆపరేషన్ చేయించుకుందిట. కొన్నాళ్ళు యిక్కడ విశ్రాంతి తీసుకుని వెళ్దామని వచ్చింది, అని.

గౌరి గుర్తుకురాగానే నా నోటంట అప్రయత్నంగా 'పిరికిపంద!' అన్న మాట బయటకువచ్చి నవ్వుకున్నాను. గౌరికి నేను పెట్టిన పేరది! నేను ఆ పేరుతో పిలవగానే రోషంతో ఎరుపెక్కిన గౌరి ముఖం, విశాలమ్మైన ఆ కళ్ళను గుండ్రంగా త్రిప్పి, కనురెప్పలు క్షణకాలం రెపరెప లాడించి తుర్రుమని పరుగుతీసే తూనీగలాంటి ఆ పరుగు! ఆ మధుర స్మృతుల వేటలో పదేళ్ళు వెనక్కి పరుగులు తీస్తున్న మనసుకి కళ్ళెం వేయడం సాధ్యమా మరి?

* * *

నేను ఉద్యోగంలో క్రొత్తగా చేరిన రోజులవి!

ఇద్దరు అక్కయ్యలు, ఒక చెల్లాయ్ మధ్య 'మగ మహారాజు'లా పెరగడంవల్ల, అప్పటికే రెండు మూడు సంబంధాలు కాళ్ళదగ్గరకు రావడంవల్ల నాలో పురుషాహంకారం పాదులు తన్నుకొంది.

ఉరకలువేసే ఆ వయసు ప్రభావమే నేమో అంతవరకు నాకు, గౌరికీ మధ్యనున్న స్నేహానికి క్రొత్త అర్థాలు స్ఫురించాయి. నా ఊహలు పసిగట్టినట్టుగా గౌరి కూడా క్షణంలో వచ్చి అమ్మతో యేదో మాట్లాడి మెరుపులా మాయమయ్యేది గౌరితో యేమేమో మాట్లాడాలని, ఏదో చిలిపిపని చెయ్యాలని మనసు ఉరకలు వేసేది. అలాంటి అవకాశం కోసం ప్రతీక్షణం యెదురు చూసే వాడిని కూడా. కాని గౌరి చాలా జాగరూకతతో మెలగడం వల్ల యెప్పుడు నాకావీలు చిక్కలేదు.

ఆ రోజు శుక్రవారం అమ్మ గుడిలోకి వెళ్ళింది. ఏదో పనిమీద వచ్చిన గౌరి ద్వారానికి నేను అడ్డుగా కూర్చుని ఉండడంతో క్షణం తటపటాయించి 'అత్తయ్య వున్నారా?' అంది.

'ఉన్నార'ని అడ్డు లేచాను. ఆ క్షణం ఆ చిన్న అబద్ధం యెందుకాడానో నా అంతరాత్మకే తెలుసు లోనికి వెళ్ళబోతున్న గౌరిని చేయిపట్టుకు ఆపాను. అనుకోని యీ హఠాత్సంఘటనకి బిత్తరపోయింది గౌరి.

'ఛ! ఏమిటిది? వదలండి' అంది కంగారుగా నా పట్టు యింకా బిగుసుకు పోయింది 'ప్లీజ్.. ఎవరైనా చూస్తే బాగుండదు' అంది.

'అంటే చూడకపోతే ఫర్వాలేదన్నమాట!' నవ్వాను. తన చేయి బలంగా గుంజుకుని పారిపోయింది. అప్పుడే నా నోటినుండి వచ్చింది 'పిరికిపంద!' అని. అప్పటికే గౌరి ముఖం సిగ్గుతో యెఱ్ఱగా కంది పోయింది రెండు రోజులు నా కంటబడకుండా తిరిగింది.

ఆ సంఘటన జరిగిన తర్వాత నా కళ్ళు ప్రతీక్షణం గౌరి కోసం యెదురుచూసేవి. అమ్మ దగ్గరకి వచ్చినా నేను కంటబడకపోతే గౌరి కళ్ళు కూడా యిటు – అటు ఆత్రంగా వెదికేవి రాను రాను అమ్మ – నాన్న లేని సమయం చూసుకుని గౌరి మా యింటికి రావడం, పని కల్పించుకుని నాతో మాట్లాడటం యెక్కువైంది. నేను కూడా యేదో అందించినట్లు, చూపించినట్లు గౌరి స్పర్శ ననుభవించేవాడిని దానినే 'ప్రేమ' అంటారేమో! కాని అంతకుమించిన చొరవ యెప్పుడూ తీసుకోనివ్వలేదు గౌరి. అందుకే కసిగా తిట్టుకునేవాడిని 'పిరికిపంద!' అని.

ఒకరోజు వున్నట్టుండి అమ్మ చెప్పింది 'గౌరిని చూసుకునేందుకు పెళ్ళివారొస్తున్నారురా యీ రోజు' అని. నాలో యేదో చెప్పలేని కలవరం! ఎందుకో తెలియదు. ఆఫీసు నుంచి త్వరగా వచ్చేసి, ఆ సాయంకాలం వచ్చే ఆ పెళ్ళివారి కోసం యెదురు చూస్తూ కూర్చున్నాను వీధి వరండాలో. మరో పది నిమిషాల్లో రానే వచ్చారు. పెళ్ళికొడుకు నా ఊహకి భిన్నంగా వున్నాడు. దృఢకాయుడు, చామనచాయ రంగు, ఉంగరాల జుట్టు. చూడగానే ఆకట్టుకునే టట్లుగా వున్నాడు. అతని ప్రక్కనే గౌరిని ఊహించుకున్నాను – పచ్చని పసిమిఛాయ, కలువ రేకుల్లాంటి కళ్ళు, లక్క పిడత లాంటి చిన్న నోరు, పిరుదులు దాటిన కురులు, దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా గుంటుంది.

నా ఆలోచనలనుండి నే నింకా తేరుకోనేలేదు. మరో గంటలో పెళ్ళిచూపుల కార్యక్రమం ముగించుకుని పెళ్ళివారు తిరిగి వెళ్ళిపోయారు. పెళ్ళికొడుకు తండ్రి గాబోలు 'వారం రోజులలోగా ఉత్తరం' రాస్తామంటున్నాడు బరువెక్కిన మనసుతో యింట్లోకి నడిచాను.

అమ్మ వస్తే మరో నాలుగు వివరాలు తెలుస్తాయి. మరో పది నిమిషాల్లో అమ్మ వచ్చింది. ఏం చెప్తుందోనని ఆతృతగా అమ్మ వెంటే వంటింట్లోకి నడిచాను

'అదేమిటిరా ఆ గౌరి పెళ్ళిచూపులకి కూర్చోనని ఒకటే గోల! అబ్బాయి లక్షణంగా బాగున్నాడు. బి.ఇడి టీచరు, రెండు మూడెకరాల పొలం అదీ వుందట. మరెవరైనా ఆ అమ్మాయి మనసులో వున్నారేమో అంటే యేం చెప్పదు. ఎంతో నచ్చచెప్పాక వచ్చి కూర్చోవడానికి ఒప్పుకుందనుకో' చెప్పవలసింది చెప్పి అమ్మ పనిలో మునిగిపోయింది.

'ఎవరైనా ఆ అమ్మాయి మనసులో వున్నారేమో' అన్న అమ్మ మాటలనే పదేపదే మననం చేసుకున్నాను. అదో విధమైన తృప్తి కలిగింది. అంతటితో ఆగక ఆ వ్యక్తి యెవరో తెలుసుకోవాలనే ఆరాటం కలిగింది.

రెండు రోజుల తర్వాత గౌరి వచ్చింది. నా అదృష్టం అమ్మగాని, నాన్నగారు కాని యింట్లో లేరు.

'రా గౌరీ! ఇలా కూర్చో. మాట్లాడుకుందాం'. గౌరి కూర్చునే ప్రయత్నం చెయ్యలేదు. ద్వారానికి చెంప ఆన్చి దగ్గరగా వచ్చి నిలబడింది.

'అమ్మ లేదు. కాస్సేపు కూర్చో' అన్నాను.

'తెలిసే వచ్చాను మీతో మాట్లాడాలని'. నా గుండె నాకే విన్పించేంత వేగం కొట్టుకుంటోంది కుడిచేతితో ద్వారమ్మీద తాళం వేస్తూ, నేలచూపులు చూస్తూ, నిల్చుంది.

'మొన్న పెళ్ళివారు వచ్చేరుట కదా? నీకు నచ్చేరా?' అనడిగాను యేదో మాట్లాడాలని. చివ్వున తలెత్తి చూసింది నావైపు. ఆ కళ్ళనిండా కన్నీళ్ళు! మనసు చివుక్కుమంది.

'సా..... ర..... థీ.... మీకు నే.... నంటే యిష్టం లేదా?' అని అడిగి ముఖం చేతుల్లో దాచేసుకుంది. ఆ ఒక్క మాటలో గౌరి మనసు అర్థమైంది. మెల్లగా లేచివెళ్ళి చేతిమీద చెయ్యి వేసాను అనునయంగా.

'మీరు..... నన్ను పెళ్ళిచేసుకుంటారా?' అంత సూటిగా, నిష్కల్మషంగా అడుగుతున్న గౌరి ప్రశ్నకు సమాధానం నా దగ్గర సిద్ధంగా లేదు. ఏమని చెప్పగలను? నా ఖరీదు నీ తల్లి దండ్రులు చెల్లించలేరనా? నా తల్లి దండ్రుల ధనదాహం మీరు తీర్చలేరనా? నా ముగ్గురు అక్క చెల్లెళ్ళ పెళ్ళి ఖర్చులు, కట్నాలు, నా చదువుకైన ఖర్చు అన్నీ కలిపి నా రేటు యింకా పెరిగిపోయిందనా? ఏమని చెప్పను? నాకు నువ్వంటే ఆ భావం లేదని చెప్పి ఆత్మవంచన చేసుకోనా? నా జవాబు కోసమే ఆత్రంగా యెదురుచూస్తోంది గౌరి.




'గౌరీ నాకు యిష్టమే. కాని' ఆ తర్వాత మరి నా నోరు పెగల్లేదు. ఆ 'కాని'కి అర్థం గౌరికి తెలుసునని నాకు తెలుసు

'అర్థమైంది సారథీ.. మరేం చెప్పకండి' చెంపల మీదుగా జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ వచ్చినంత వేగం వెళ్ళిపోయింది. నేను ఆపే ప్రయత్నం చెయ్యలేదు

మరొక వారం రోజులలో గౌరి పెళ్ళి నిశ్చయం అయిపోయింది ముహూర్తాలు పెట్టుకున్నారు. పెళ్ళికి నేనూ వెళ్ళాను 'నాదీ' అనుకున్న వస్తువు నెవరో లాక్కున్న భావన, దక్కించుకోలేని నా అశక్తత నన్ను వెక్కిరిస్తుంటే మౌనంగా పందిట్లో నుంచి నిష్క్రమించాను

* * *

అత్తవారింటికి వెళ్ళివచ్చిన ప్రతిసారీ గౌరి మా యింటికి వచ్చేది నాతోనూ మాట్లాడేది కాని ఆ చూపుల్లో, ఆ మాటల్లో యేదో పెద్దరికం సంతరించుకుంది ఉన్నట్లుంది 'మావా రొచ్చే వేళయింది వస్తా' నంటూ లేచి పోయేది 'ఏం మీ వా రంటే అంత భయమా? పిరికిపంద!' అని హాస్య మాడితే మనస్ఫూర్తిగా నవ్వేది పెద్ద ఆరిందాలాగ నా పెళ్ళి విషయాలెన్నో అడిగి తెలుసుకునేది

ప్రతీసారీ 'ఈసారైనా నేను వచ్చేసరికి పెళ్ళి ముహూర్తాలు పెట్టించండి.. ఏకంగా మీ యింట్లోనే మకాం పెట్టేస్తాను' అనేది అమ్మతో

* * *

'హలో! సారథీ బాగున్నారా?' ఆ పలకరింపుకి వెనుదిరిగి ఆశ్చర్యపోయాను. ఎదురుగా గౌరి! ప్రక్కనే మూడేళ్ళ పాప!

'రా రా! ఎప్పుడొచ్చావు?' ఏమిటి సంగతి? అంటూ నేను కుర్చీలో కూర్చుంటూ తనకీ ఓ కుర్చీ చూపించాను. 'మీరే యేమైనా సంగతులు చెప్తారని యిలా వచ్చాను' అంది నా వైపు క్రీగంటితో చూస్తూ. మీ రెక్కడికో బయలుదేరుతున్నట్లుంది. నేను అడ్డు వచ్చానా? అత్తయ్య యెక్కడికి వెళ్ళారు?'

నా బలహీనత యేమిటోగాని గౌరి ముందు ఆబద్ధం ఆడలేను. 'అమ్మ ఏదో సంబంధం వుందంటే ఖాయం చెయ్యడానికి వెళ్ళింది. నీకు తెలుసుకదా అమ్మ సంగతి? నాన్నగారు పోయినదగ్గర్నుంచీ మరీ చాదస్తం పెరిగిపోయింది. తను చూసి, నచ్చితే నన్ను తీసుకువెళ్తుంది. ఇందులో నా దంతా

నామినల్ రోల్ అనుకో' నవ్వలేక నవ్వాను ఆ నవ్వులో యెంత విషాదం వుందో ఒక్క గౌరే అర్థం చేసుకో గలదని నా నమ్మకం మరో అయిదు నిమిషాలు మాట్లాడి గౌరి వెళ్ళిపోయింది చంటి పిల్లాడు ఏడుస్తున్నాడని.

నాకు, గౌరికీ వయస్సులో నాలుగైదేళ్ళే తేడా! అయినా మా జీవితాలలో యెంత తారతమ్యం? గౌరి ముగ్గురు పిల్లల తల్లి నేను? ఇంకా పెళ్ళిచూపుల కోసం వెళ్ళివస్తున్న పెళ్ళికొడుకుని! అక్కయ్యలిద్దరి పెళ్ళి ఏవో లోన్‌లు, కొంత ఆస్తి పెట్టి చేసేసారు ఆ తర్వాత కూడా నాకు వచ్చిన సంబంధాలన్నింటిని అమ్మ 'అమ్మాయి పెళ్ళిచేస్తేగాని చెయ్యమ'ని తిరస్కరించింది చెల్లాయి పెళ్ళి అయి నాలుగేళ్ళు కావస్తున్నా, ఈ నాలుగేళ్ళలో కనీసం ఓ ముప్ఫై దాటి సంబంధాలు వచ్చినా 'నీకు తగ్గది రాలేదురా' అంటుంది అమ్మ. అమ్మాయి నచ్చితే కట్నం నచ్చదు. కట్నం నచ్చితే అమ్మాయి నచ్చదు. అన్నీ నచ్చితే లాంఛనాలు నచ్చవు! ఇన్నేళ్ళకి నాకు వచ్చిన ఆలోచనలకి నాకేనవ్వు వచ్చింది

'పోస్ట్' కేకవిని లేచివెళ్ళి ఉత్తరం అందుకున్నాను. ఫ్రమ్ అడ్రస్ లేదు. ఉత్తరం చించి చదవడం ప్రారంభించాను.

'డియర్ సారథీ,

మీకు నేను వ్రాస్తున్న మొదటి ఉత్తరం. మొన్న ఊరు నుంచి వచ్చిన దగ్గర్నుంచీ మీ గురించే ఆలోచిస్తున్నాను. కొందరికి జీవితాన్ని యెలా అనుభవించాలో తెలియదు. అలాంటివారిలో మీరూ ఒకరు. నా మనసువిప్పి మాట్లాడినప్పుడు, నా చేయి అందుకోలేకపోయారు. నా ఫ్రెండ్ సునందని చూస్తుకువచ్చారు మీ అమ్మగారికి వాళ్ళిచ్చే లాంఛనాలు సరిపోలేదుట! ఆ విషయం నాకు మొన్ననే తెలిసింది. మరొక సంబంధం ఆస్తిపాస్తులు లేవని, మరొకటి అమ్మాయి నచ్చలేదని అలా అలా అన్నీ వదులుకున్నారు. నా ఊహ నిజమైతే మీకు ముప్ఫై అయిదేళ్ళు పూర్తి అవుతాయి. యీ మాఘానికి. అంటే జీవితంలో సగ భాగం (నేటి జీవిత ప్రమాణాలనిబట్టి) అన్వేషణలో గడిచిపోయింది. అనుభవించే దెప్పుడు? మిమ్మల్ని ఒక బజారు వస్తువుగా విక్రయించదలచుకున్న మీ తల్లి దండ్రులకి తల వంచి, ఎదురు తిరగలేక మీలో మీరే కుమిలిపోతున్నారు. జీవితం మీది..... అనుభవించేది మీరు. నిర్ణయం కూడా మీదే కావాలి! మీ జీవితాన్ని అనుభవించే సంపూర్ణమైన హక్కు మీ కుంది. కాని ఆ హక్కుని వినియోగించుకునే ధైర్యం మీలో లేదు. మీరే కాదు.. మీలాంటి 'పిరికిపంద'లు ఎందరో వున్నారు. మీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోలేని మీరు స్వతంత్ర భారతంలో అస్వతంత్ర పౌరులుగా బ్రతుకుతున్నారంటే అతిశయోక్తి కాదేమో!

త్వరలోనే మీ నుండి శుభవార్త కోసం యెదురు చూస్తున్న –

'గౌరి'

'పిరికిపంద!' ఎంత ధైర్యంగా నన్ను సంబోధించింది? వెన్నుమీద యెవరో చెళ్ళున చరచినట్లయింది. ఉత్తరాన్ని రెండుసార్లు చదివాను. అందులో అక్షరంముక్క కూడా అబద్ధంకాదు నా ఆటో బయోగ్రఫీ నేను వ్రాసుకున్నట్లుగా వుంది

'అమ్మా ప్రక్కింటి తాతగారు చాక్లెట్ యిచ్చారు' మూడేళ్ళ గౌరి కూతురు తల్లితో చెప్పింది.

'తప్పమ్మా . తాతగారు కాదు.... అంకుల్ అనాలి' గౌరి కూతుర్ని మందలించింది వారం రోజుల క్రితం మాట యిది! అంటే నేను...? నాకే అనుమానం వచ్చి మరోసారి నిలువు టద్దం ముందు నిల్చున్నాను అలా అలా అరగంట. గంట .. నాలోని యౌవనం అంతా తరిగిపోతున్నట్లు .. నా చుట్టూ చిన్న చిన్న పిల్లలంతా చేరి 'తాతయ్యా – తాతయ్యా' అని అరుస్తున్నట్లు భావన!

నేను నువ్వు అనుకున్నట్లు పిరికిపందను కాలేను గౌరీ! గట్టిగా అరవాలన్పించింది.

* * *

'సారథీ వెడ్స్ సునంద' శుభలేఖ చూసిన గౌరి. ఏమంటుందో యిప్పుడు? అనుకుంటూ కవర్లో పెట్టి పోస్ట్ చేశాను – మరో పది రోజుల తర్వాత. నా తిరుగుబాటు ఊహించని అమ్మ మాత్రం మౌన వ్రతం వహించింది మరి!

